ఇసుక లేక.. పనులు సాగక..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి మూడు నెలల పైగా పూర్తి చేసుకుంది. ఎన్నికల సమయంలో ఇసుక ఉచితంగా అందిస్తామని ప్రగల్భాలు పలికారు. ప్రస్తుతం ఉచితంగా అందడం అటుంచితే పేద ప్రజలు రూ.వేలు వెచ్చించినా ఇసుక దొరకడం లేదు. దీంతో సామాన్య ప్రజల ఇళ్లు అసంపూర్తిగా మిగిలాయి. కొత్తగా నిర్మాణాలు మొదలు పెట్టాలన్న సాహసం అసలు చేయడం లేదు.

- ఇసుక కోసం సామాన్య ప్రజల అవస్థలు
- అడ్డదారుల్లో జొన్నవాడ, మినగల్లు రీచ్‌ల నుంచి తమ్ముళ్ల తరలింపు
- రూ.కోట్లలో సొమ్ము చేసుకుంటున్న టీడీపీ నేతలు


మినగల్లు రీచ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఇసుకకు సంబంధించి శాశ్వత విధానాన్ని ఇప్పటివరకు అమలు చేయలేదు. నూతన ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకోవాలంటే అవస్థలు తప్పడం లేదు. ఇసుక కావాల్సిన చోట అందుబాటులో ఉండటంలేదు. ఆన్‌లైన్‌లో ఇసుక నిల్వలు లేవని చూపుతుండటంతో ఇసుక బుకింగ్‌కు సమస్యలు తలెత్తుతున్నాయి. అయినప్పటికీ టీడీపీ నేతలు మాత్రం అడ్డదారుల్లో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు.

పూట గడవక

ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ పనులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూట గడవక, కుటుంబ పోషణ భారమై పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకటి రెండురోజులైతే కార్మికులు తట్టుకోగలరు. దాదాపు నాలుగైదు నెలల నుంచి ఇసుక అందుబాటులో లేకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయిన వాళ్లకి అక్రమంగా...

ఓ పక్క ఇసుక లభించక పేద ప్రజలు అవస్థలు ఎదుర్కొంటుంటే మరోపక్క టీడీపీ నాయకుల సానుభూతిపరులు, వారి బంధువులకు ఇసుక అక్రమంగా తోలుతున్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఇసుక తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. నిత్యం బుచ్చిరెడ్డిపాళెం మండలంలో పెనుబల్లి, జొన్నవాడ, బుచ్చి పట్టణంలో ఇసుక ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఎన్నిసార్లు పత్రికల్లో వార్తలు వచ్చినా, అక్రమార్కులు పక్కాగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని తెలిసినా అధికార యంత్రాంగం కనీస చర్యలు తీసుకోవడం లేదు. మినగల్లు, జొన్నవాడ రీచ్‌ల తనిఖీలకు ఇప్పటివరకు అధికారుల వెళ్లిన దాఖలాలు లేవు. దీనిని బట్టి చూస్తే అధికారులు ఏవిధంగా పని చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

ఇసుక లేక ఆగిన నగర పంచాయతీ కార్యాలయం

ఇసుక అందుబాటులో లేకపోవడంతో పట్టణంలో నిర్మిస్తున్న నగర పంచాయతీ కార్యాలయ పనులు నిలిచాయి. పదిరోజుల క్రితం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నగర పంచాయతీ పనులను పునఃప్రారంభించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అయితే ఆమె హామీలు ఏ మాత్రం అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయ నిర్మాణానికే ఇసుక దొరక్కపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు.


ఇసుక అందుబాటులో లేక పునాదుల దశలోనే ఆగిన నగర పంచాయతీ భవనం

ఆన్‌లైన్‌లో అందుబాటులో లేదు



నగర పంచాయతీ కార్యాలయ నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో ఇసుక కోసం బుక్ చేసుకునేందుకు ప్రయత్నిస్తే ప్రస్తుతానికి ఇసుక నిల్వలు లేవని చూపుతోంది. ఈ పరిస్థితుల్లో నగర పంచాయతీ కార్యాలయ నిర్మాణం ముందుకు సాగడం కష్టం. ఇసుక అందుబాటులోకి వస్తే పనులు మొదలు పెడతాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్, బుచ్చి నగర పంచాయతీ

నేడు ధర్నా చేస్తాం



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారుగా నాలుగు నెలలు పూర్తి కావొస్తుంది. ఉచిత ఇసుక అందిస్తామని అధికారంలోకి వచ్చి అసలు ఇసుక లేకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పనులు లేక భవన నిర్మాణ కార్మికులు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. ప్రజల పక్షాన ఈనెల 4న(నేడు) మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేసేందుకు సిద్ధమవుతున్నాం.

– సీహెచ్ మల్లికార్జున, సీఐటీయూ మండల కార్యదర్శి

క్లుప్తంగా

వరద బాధితులకు దుస్తుల పంపిణీ



వెంకటాచలం: విజయవాడ వరదల కారణంగా ఇబ్బందులు పడిన కుటుంబాలకు వెంకటాచలానికి చెందిన న్యూలైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం వారు వంతు సాయం అందజేశారు. వృద్ధులకు దుప్పట్లు, మహిళలకు చీరలు, పురుషులకు షర్ట్స్, టీషర్ట్స్, చిన్న పిల్లలకు సరిపడే దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ మనోజ్‌కుమార్, సభ్యులు చందు, కె.బాబు, తిరుపాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న సర్పంచ్ సుబ్బయ్య

తోటపల్లిగూడూరు : గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని పాపిరెడ్డిపాళెం సర్పంచ్ కదురు సుబ్బయ్య విజ్ఞప్తి చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం సాధారణ గ్రామసభలు జరిగాయి. ఈ క్రమంలో సర్పంచ్ సుబ్బయ్య అధ్యక్షతన పాపిరెడ్డిపాళెం సచివాలయంలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజా ప్రతినిధులు కృషి చేస్తున్నారన్నారు. ఈ విషయంలో అధికారులు పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాల నిర్వహణలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కోడూరు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామసుబ్బయ్య, మేనాటి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ అనుమతితో ఉపాధి పనులు

మనుబోలు : గ్రామసభల అనుమతితోనే ఉపాధి హామీ పనులను మంజూర చేస్తామని ఏపీఓ రాజమ్మ తెలిపారు. మనుబోలు పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ గ్రామసభను గురువారం నిర్వహించారు. గ్రామంలో ఏఏ పనులను ఉపాధి పథకం ద్వారా చేయాలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామసభల ద్వారా ఆయా గ్రామాల్లోని ప్రజలందరి ఆమోదంతోనే పనులు చేస్తామన్నారు. తమకు ఏ పనులు ముఖ్యమో గ్రామస్తులే తెలియజేయాలన్నారు. అలాగే చెర్లోపల్లి, పిడూరు గ్రామసభల్లో ఆమె పాల్గొన్నారు. మరో ఎనిమిది గ్రామాల్లో కూడా గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. సర్పంచ్ కంచి పద్మమ్మ, ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు కృష్ణవేణి, చెంచు ప్రసాద్, టీఏ గురప్ప, ఈసీ సుప్రజ, ఎఫ్ఏలు సునీల్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా పనిచేయాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆమె హాజరై, మాట్లాడారు. రాజకీయాలు ఎన్నికల వరకేనని ప్రతిఒక్క కౌన్సిలర్ పట్టణ అభివృద్ధికి తమవంతుగా చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు



మనుబోలు : మండలంలోని జట్లకొండూరు పంచాయతీ కుడితిపల్లి గ్రామంలో గురువారం హ్యాండ్ బోరును ఏర్పాటు చేశారు. ఇక్కడి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వారు ఉప సర్పంచ్ అవుల తులసీరాం దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి మహాలక్ష్మమ్మ గుడి సమీపంలో హ్యాండ్ బోరును ఏర్పాటు చేయించారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

వెంకటాచలం : మైనర్ బాలికపై యువకుడు లైంగికదాడికి యత్నించిన ఘటన మండల కేంద్రమైన వెంకటాచలంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన 13 ఏళ్ల మైనర్ బాలిక టిఫిన్ తెచ్చుకునేందుకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగికదాడికి యత్నించాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక కుటుంబ సభ్యులు ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎంపీడీఓకు సన్మానం



పొదలకూరు : ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి బదిలీపై విడవలూరు మండలానికి వెళ్తున్నారు. ఈ సందర్భంగా గురువారం దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, పులికల్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.నారాయణరెడ్డిలు ఎంపీడీఓకు ఆమె కార్యాలయంలో వీడ్కోలు పలికారు. శాలువతో సత్కరించి ఆమె సేవలను కొనియాడారు. నగేష్‌కుమారి బాధ్యతల నుంచి రిలీవయ్యారు.

నూతన ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ నేడు

బుచ్చిరెడ్డిపాళెం నుంచి పొదలకూరుకు బదిలీ అయిన ఎంపీడీఓ నరసింహారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరిస్తారని కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇదే రోజున ఏఓ కూడా తన బాధ్యతల నుంచి రిలీవై జెడ్పీకు వెళ్లనున్నారు.

కొండా సురేఖను బర్తరఫ్ చేయాలి

కోవూరు : తెలంగాణ మంత్రి కొండా సురేఖను తన పదవి నుంచి బర్తరఫ్ చేయాలని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సినీ నటుల గురించి సురేఖ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి

పొదలకూరు : నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని.. పార్టీ అండగా ఉండి ముందుకు నడిపిస్తుందని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పార్లపల్లి గ్రామంలో గురువారం ఓ వివాహ వేడుకకు హాజరైన కాకాణి పెద్ద ఎత్తున చేరుకున్న నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పేదలకు అందే పరిస్థితి లేదన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా పార్టీ జిల్లా అధ్యక్షునిగా అండగా నిలబడుతానని, అధికారుల ఒత్తిళ్లకు తలొగ్గి అన్యాయం చేస్తే పోరాటాలు తప్పవన్నారు. గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. కాకాణి వెంట బిరదవోలు ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్, జెడ్పీటీసీ నిర్మలమ్మ, మాజీ ఎంపీపీ కోనం బ్రహ్మయ్య, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, నాయకులు వెన్నపూస దయాకర్‌రెడ్డి, నీలి పెంచలయ్య, శ్రీహరి, కాకు శ్రీనివాసులు, వెన్నపూస శివారెడ్డి, విజయ్, గోపాలయ్య, వెంకట్రావ్, సుధాకర్‌రెడ్డి, యానాదిరెడ్డి తదితరులు ఉన్నారు.


నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కుడితిపాళెం యూత్‌కు అవార్డు

ఇందుకూరుపేట : మండలంలోని కుడితిపాళేనికి చెందిన కుడితిపాళెం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ వారికి రెడ్‌క్రాస్ అవార్డు వరించింది. ఈ మేరకు అసోసియేషన్ సభ్యులు నెల్లూరులో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం అవార్డును అందుకున్నారు. ఈ



ఏడాదిలో మొత్తం 246 యూనిట్ల రక్తాన్ని అందించినందుకు వారికి అవార్డు దక్కింది.

సాయినాథునికి పూజలు

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు.

వెంకటేశ్వర కళాశాలకు రెడ్‌క్రాస్ అవార్డు

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు రెడ్‌క్రాస్ వారి అవార్డు దక్కింది. 'నేషనల్ వలంటీర్ బ్లడ్ డొనేషన్ డే' సందర్భంగా అత్యధిక యూనిట్‌ల రక్తదానం చేసిన సంస్థలు, వ్యక్తులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం అవార్డులు ప్రదానం చేశారు. వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా ఎక్కువ యూనిట్‌ల రక్తదానం చేసి ఉన్నారు. ఇందుకు గానూ ఎమ్మెల్సీ, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యాలయంలో గురువారం అవార్డులు ప్రదానం చేశారు. వెంకటేశ్వర కళాశాల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రవికుమార్ ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగేంద్ర, ఏఓ కె.గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్

రబీ సాగులో విత్తన ఎంపిక కీలకం


ముత్తుకూరు : నవధాన్యాల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


ఇందుకూరుపేట : సూచనలు చేస్తున్న అధికారులు


పొదలకూరు : మాట్లాడుతున్న ఏఓ వాసు


తోటపల్లిగూడూరు : వెంకన్నపాళెంలో..

ముత్తుకూరు : రాబోయే రబీ సీజన్ వరిసాగుకు సంబంధించి విత్తనాల ఎంపిక కీలకమని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి అన్నారు. మండలంలోని బ్రహ్మదేవి, పిడతాపోలూరు గ్రామాల్లో గురువారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దీర్ఘకాలిక వరి విత్తనాలైతే అక్టోబరు 15 నుంచి నవంబరు 15లోగా విత్తుకోవాలన్నారు. స్వల్పకాలిక రకాలైతే నవంబరు 15 నుంచి డిసెంబరు 15 లోగా విత్తుకోవాలని సూచించారు. సూక్ష్మ సేద్యం పరికరాలైన స్ప్రింక్లర్లు, డ్రిప్‌లు రాయితీపై అందుబాటులో ఉన్నాయన్నారు. వెటర్నరీ అధికారి డాక్టర్ శివతేజారెడ్డి మాట్లాడుతూ, కిసాన్ క్రెడిట్ కార్డుల ఆవశ్యకతను వివరించారు. ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వర్షపాతం అనుకూలంగా సాగు చేయాలి

పొదలకూరు : రైతులు వర్షపాతం అనుకూల పంటల సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి ఎ.వాసు పేర్కొన్నారు. మండలంలోని బత్తులపల్లి, నేదురుమల్లి గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నీటి లభ్యతను అనుసరించి పంటల సాగు చేస్తే రైతులు ఇబ్బందులు పడరన్నారు. సబ్సిడీపై మినుము, పెసర, వరి విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కౌలు రైతులు విధిగా సీసీఆర్సీ చేయించుకోవాల్సిందిగా సూచించారు. నిమ్మలో సూక్ష్మ పోషక లోపాలు, లక్షణాలను ఉద్యానాధికారి ఈ.ఆనంద్ వివరించారు. నిమ్మ, మామిడి మొక్కలపై రైతులకు అందుతున్న సబ్సిడీ వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో సెరీకల్చర్ ఫీల్డ్‌ఆఫీసర్ బి.మస్తానయ్య, ఏఈఓ ఏడుకొండలునాయక్, వీఏఏ గోవర్ధన్, వీహెచ్ఏ షరీఫ్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు : వరిసాగులో రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని మండల ఏఓ శిరీషారాణి సూచించారు. మండలంలోని పోట్లపూడి, వెంకన్నపాళెం రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది గ్రామసభలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం నశించి పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. దీనికోసం పచ్చిరొట్ట విత్తనాలను వాడడం ఉత్తమమన్నారు. సాగుకు ముందు విత్తన శుద్ధి చేపడితే వరిసాగులో చీడపీడలను నివారించవచ్చన్నారు. అనంతరం స్థానిక పంట పొలాల్లో క్షేత్ర సందర్శన చేపట్టి రైతులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిల్లకూరు ప్రసూనమ్మ, వీఏఏలు అనూష, దయాన, సిబ్బంది పాల్గొన్నారు.

మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోండి

కొడవలూరు : 90 శాతం రాయితీతో ఇచ్చే మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని కొడవలూరు పశువైద్యాధికారి హర్షారెడ్డి కోరారు. మండలంలోని దామేగుంట, వెంకన్నపురం, తలమంచి గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తలమంచిలో ఆయన మాట్లాడుతూ రెండు పశువులకు రూ.1.15 లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85 లక్షల వంతున పశు సంవర్థక శాఖ ద్వారా ఇస్తారన్నారు. షెడ్డుల రూపంలో ఏర్పాటు చేయనున్నందున ఉపాధి హామీ నిధులు 90 శాతం మంజూరు చేస్తారన్నారు. లబ్ధిదారు కేవలం పది శాతం నిధులు మాత్రమే భరించాల్సి ఉంటుందని చెప్పారు. ఏఓ లక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమన్నారు. రసాయన ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఎ.అనూష, వీఏఏలు బి.లిఖిత, ఎస్.ప్రసాద్, వెటర్నరీ సహాయకులు వెంకయ్య, సర్పంచ్ యాటగిరి భాస్కర్‌రావు, సిబ్బంది రాంప్రసాద్, అనూష పాల్గొన్నారు.

పున్నూరు, లేబూరులో..

ఇందుకూరుపేట : మండలంలోని పున్నూరు, లేబూరు బిట్ –1 గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ డి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చెంచు బాలకృష్ణ, విజయ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.నరేష్, డి.సుమలత, వెటర్నరీ అసిస్టెంట్ గీతమ్మ, ఫిషరీస్ అసిస్టెంట్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన

విడవలూరు : మండలంలోని ముదివర్తి, వావిళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ పి.వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ రైతులకు ఎక్కువ దిగుబడిని ఇచ్చే విత్తనాల గురించి వివరించినట్లు తెలిపారు. ప్రకృతి సాగు ప్రాముఖ్యతను తెలియజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తాతా ప్రభాకర్, పశు వైద్యాధికారి వి.వాణి శంకర్, వీఏఏ శరన్‌బాబు పాల్గొన్నారు.


విడవలూరు : మాట్లాడుతున్న ఏఓ వెంకటకృష్ణయ్య


కొడవలూరు : తలమంచిలో..

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు


పొదలకూరు : వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల పూజలు


కోవూరు : వేడుకగా కలశ ఊరేగింపు


పొదలకూరు : కన్యకా పరమేశ్వరి ఆలయంలో..


కోవూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో..

- తొలిరోజు వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం

పొదలకూరు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం రోజున ఉదయం 10 గంటలకు కలశస్థాపన, ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆదూరు వెంకటసుబ్బయ్య, ఆదూరు సునీల్ వ్యవహరించారు. సాయంత్రం లలితా సహస్రనామార్చన, త్రిశతి పూజలు చేశారు. అమ్మవారు కన్యకాపరమేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళల కోలాటం భక్తులను ఆకట్టుకుంది. నవరాత్రి మహోత్సవాల సందర్భంగా దేవస్థానాన్ని రంగురంగుల విద్యుద్దీపాలంకరణ చేశారు.

రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో..

పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి పూజలు మొదలయ్యాయి. నవరాత్రులు పూర్తయ్యేంత వరకు అమ్మవారికి తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని అర్చకుడు ప్రసాద్‌స్వామి తెలిపారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజున అమ్మవారు వీరలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కాంతమ్మతల్లి ఆశ్రమంలో..

మండలంలోని ఇనుకుర్తిలో ఉన్న ఆదిపరాశక్తి కాంతమ్మతల్లి ఆశ్రమంలో నవరాత్రి మహోత్సవాలను ప్రారంభించారు. కలశస్థాపన, ప్రాణప్రతిష్ఠ చేశారు. శ్రీస్వర్ణ దుర్గా అలంకారంలో తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

చాముండేశ్వరీదేవి ఆలయంలో..

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి ఆలయంలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయకర్తలుగా రాముడుపాళేనికి చెందిన మావులూరు శ్రీనివాసులురెడ్డి, మావులూరు శ్రీధర్‌రెడ్డి, గిరిజమ్మ వ్యవహరించారు. తొలుత మాల ధరించిన మహిళా భక్తులు కలశాలతో స్థానిక శివాలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు తరలివచ్చారు. కాగా మైపాడు శివాలయంలో అమ్మవారికి పల్లకిసేవ గావించారు.

కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..

కోవూరు : మండల కేంద్రంలోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో కొలువైన వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం 108 కలశాలతో ఊరేగింపు జరిగింది. స్థానిక ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి కోవూరు పుర వీధుల గుండా ఆలయ ప్రాంగణం వరకు ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేరళ బ్యాండ్ ఆకట్టుకుంది.

సావిత్రీదేవిగా కన్యకాపరమేశ్వరి

ఉత్సవాలను పురస్కరించుకుని కన్యకాపరమేశ్వరి అమ్మవారు సావిత్రీదేవిగా దర్శనమిచ్చారు. అర్చకుడు నందకిశోర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయకర్తలుగా వై.వెంకట సుబ్రహ్మణ్యం, వెంకట సురేష్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో..

కోవూరులోని పాటూరు రోడ్డులో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నవరాత్రి మహోత్సవాలు గురువారం కలశ స్థాపనతో ప్రారంభమైంది. ఆలయ అర్చకుడు గూడలి మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వైభవంగా కలశ స్థాపన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం కలశస్థాపనతో వైభవంగా మొదలయ్యాయి. ఉదయం శ్రీసూక్త పారాయణం, దేవీ సప్తశతి, దేవీ భాగవత పారాయణాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం పెన్నానది నుంచి ఆలయ వేద పండితులు పవిత్ర జలాలు తీసుకొచ్చి ఆలయంలో కలశస్థాపన చేశారు. ఈ ఉత్సవంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.